సాక్షి నల్లగొండ

గురువారం । 2 । మే । 2024



కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

- IIలో



ఎన్నికలపై నిఘా నేత్రం

ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు ఎన్నికల కమిషన్ నిఘాను మరింత పటిష్టం చేసింది.

- IIలో

గరిష్టం / కనిష్టం 44° / 27°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నల్లగొండ క్రైం : రాజకీయ కరపత్రాల ముద్రణలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘిస్తే తగిన చర్యలు తప్పవని ఎస్పీ చందనాదీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రచార కరపత్రాల్లో ప్రచురణ కర్త పేరు, చిరునామా, ప్రింటర్ పేరు ఉండాలని పేర్కొన్నారు. కరపత్రాలు ఎవరికీ వ్యతిరేకంగా ఉండకూడదని సూచించారు. కోర్టు కేసులకు సంబంధించిన అంశాలు లేకుండా నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

చిట్యాల : ఓటు హక్కును ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని నల్లగొండ జెడ్పీ సీఈఓ, ఎస్‌వీఈఈపీ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆఫీసర్ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పరిధిలోని గాంధీ గుడి ఆధ్వర్యంలో ఓటర్లకు ఓటుపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార వాహనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ రోజున ప్రతి ఒక్కరు ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ జయలక్ష్మి, గాంధీ గుడి మేనేజర్ జిట్ట నరేష్ పాల్గొన్నారు.

బృందావనపురం లిఫ్ట్ పైప్‌లైన్ పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ అధికారులు

త్రిపురారం : ఎత్తిపోతల పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇరిగేషన్ ఎస్‌ఈ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. బుధవారం త్రిపురారం మండలంలోని బృందావనపురం గ్రామంలో ఉన్న ఎత్తిపోతల పథకం పైపులైన్లను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. మూడు సంవత్సరాల నుంచి ఎత్తిపోతల పథకం పనిచేయడం లేదని, పైప్‌లైన్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ కరుణాకర్, డీఈ శ్రీనివాస్, ఏఈ ప్రవీణ్, రైతులు నరోత్తమ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మారయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి



ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న సైదులు

నార్కట్‌పల్లి : కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముగాస్తు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని.. ఆ విధానాలను తిప్పికొట్టాలని ఎల్‌ఐసీ ఏఓఐ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు నలపరాజు సైదులు అన్నారు. బుధవారం మే డే సందర్భంగా నల్లగొండ ఎల్‌ఐసీ బ్రాంచ్-1 ఎదుట ఆయన సీఐటీయూ జెండాను ఎగురవేసి.. ఐసీఈయూ అధ్యక్షుడు, కార్యదర్శి వి.కృష్ణయ్య, నవీన్‌దాస్‌తో కలసి ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కుల మతాలకు అతీతంగా కార్మిక పక్షాన జరిగే ఏకైక పండుగ మే డే అన్ని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన ఎల్‌ఐసీని కార్పొరేట్లకు అప్పనంగా దోచిపెట్టే విధానాన్ని అవలంబించడం సరికాదన్నారు. కార్యక్రమంలో మైనంపాటి అరుణ, సుంకి దేవేందర్, ప్రజ్ఞాపురం శివశంకర్, నాగార్జున మహేశ్వరి, నోముల నాగమణి, ఖమ్మంపాటి సైదులు, యాదయ్య, వెంకన్న, అంకురి పృథ్వీ, ప్రభాకర్‌రెడ్డి, షణ్ముకచారి, ప్రసాద్, శ్రీనివాస్, యాదగిరి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి నేడు నోటిఫికేషన్

- నేటి నుంచి 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన నోటిఫికేషన్ విడుదల చేసి వెంటనే నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరించనున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన ఆర్‌ఓగా ఉన్నారు. 13వ తేదీన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణకు ములుగు జిల్లా అదనపు కలెక్టర్‌ను నియమించారు. నల్లగొండ కలెక్టర్ అందుబాటులో లేని సమయంలో ఆయన అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు.



పల్లా రాజీనామాతో ఉప ఎన్నిక..

2021లో జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆయన గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఆరు నెలల్లో ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండడంతో అందుకు ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేశారు. గురువారం నోటిఫికేషన్ విడుదల చేసి ఈ నెల 9వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 10న నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. 13వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరి గడువు. అదే రోజు బరిలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తారు. 27వ తేదీన పోలింగ్ జరగనుంది. జూన్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి..

పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించిన నామినేషన్ల స్వీకరణకు నల్లగొండ కలెక్టరేట్‌లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నామినేషన్ పత్రాలను అందుబాటులో ఉంచారు. ఇప్పటికే ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లా పరిధిలో 4,61,806 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. 12 కొత్త జిల్లాల పరిధిలో 600 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 9న తుది జాబితా ప్రకటించనున్నారు.

రఘువీర్‌కు అత్యధిక మెజార్టీ రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

- అందరి దృష్టి నల్లగొండపైనే ఉంది
- కష్టపడి పనిచేసే కార్యకర్తలకే అవకాశాలు
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నల్లగొండలో కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి సమావేశం



వేదికపై ముచ్చటిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

నల్లగొండ : కాంగ్రెస్ నల్లగొండ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి దేశంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని ఎంఎస్‌ఆర్ గార్డెన్స్‌లో బుధవారం కాంగ్రెస్ నల్లగొండ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలంతా కష్టపడి పని చేసిన నల్లగొండ నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజారిటీ ఇవ్వాలన్నారు. నల్లగొండ నియోజకవర్గ ప్రజలు నాకు రాజకీయ జన్మనిచ్చి ఈ స్థాయికి ఎదిగేలా చేశారని.. మీకు ఏ కష్టం వచ్చినా మీ వెంటే ఉంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఆరు గ్యారంటీల అమలు చేసిందని.. నల్లగొండ నియోజకవర్గానికి రూ.వేయి కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేయిస్తున్నానని చెప్పారు. నియోజకవర్గంలో 10 వేల ఇళ్లు కట్టించాలన్నదే తన ధ్యేయమన్నారు. డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.450 కోట్లు మంజూరయ్యాయని, హైదరాబాద్ తరహాలో రూ.90 కోట్లతో నీలగిరి నిలయం నిర్మిస్తున్నామని, రూ.700 కోట్లతో రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంతో మందికి ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు.

పనిచేసిన వారికే స్థానిక సంస్థల్లో అవకాశం..

12 రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున ప్రతి నాయకుడు, కార్యకర్తా రఘువీర్‌రెడ్డిని గెలిపించేందుకు కష్టపడి పని చేయాలని సూచించారు. కష్టపడి పనిచేసిన వారికే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అవకాశలు ఇస్తామని, ఆ ఎన్నికల ఖర్చు తానే భరిస్తానని చెప్పారు. గుత్తా జితేందర్‌రెడ్డి, అమిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడం స్వాగతిస్తున్నామన్నారు. మాజీ మంత్రి జానారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి రఘువీర్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎన్ని మోసాలు చేసినా ప్రజలు గమనించి ఆ పార్టీకి బుద్ధి చెప్పారన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ మెజార్టీలో అన్ని నియోజకవర్గాలు పోటీ పడుతున్నాయని, ఇలాంటి పోటీ ఉంటే అత్యధిక మెజార్టీ సాధించడం ఖాయమన్నారు. తననున గెలిపిస్తే మీ నియోజకవర్గంలో వెంకట్‌రెడ్డి తమ్ముడిగా ఆయన వెంటే ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గుత్తా అమిత్‌రెడ్డి, ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, వంగూరి లక్ష్మయ్య, జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, ఇంతియాజ్ అలీ, బొడ్డుపల్లి లక్ష్మి పాల్గొన్నారు.


మోహన్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి పదవి..

కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తాను భువనగిరి ఎంపీగా ఉన్న సందర్భంలో నల్లగొండలో పార్టీ బాధ్యతను మోస్తూ కార్యకర్తలు ఏ పని మీద వచ్చినా వారి సమస్యను పరిష్కరించాడని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మోహన్‌రెడ్డికి రాష్ట్ర స్థాయి పదవి వస్తుందన్నారు.

పట్టణాల ఖజానా గలగల

ఎర్లీబర్డ్‌కు అనూహ్య స్పందన

- 5 శాతం రాయితీని వినియోగించుకున్న మున్సిపాలిటీల ప్రజలు
- పన్ను వసూలులో ముందున్న నకిరేకల్ మున్సిపాలిటీ



నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీల్లో ముందస్తు ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ (ఎర్లీ బర్డ్) అవకాశం కల్పించడంతో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. దీంతో మున్సిపాలిటీల ఖజానాలు గలగలగా మారాయి. జిల్లాలో 8 మున్సిపాలిటీలు ఉండగా.. నందికొండ మున్సిపాలిటీలో ఆస్తి పన్నుకు సంబంధించి మదింపు చేపట్టలేదు. దాంతో నల్లగొండ, మిర్యాలగూడ, హాలియా, దేవరకొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్ మున్సిపాలిటీల్లో వేలాది మంది భవనాల యజమానులు ఎర్లీబర్డ్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను మొత్తం ఒకేసారి (ఏప్రిల్‌లో) చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఇచ్చిన విషయం తెలిసిందే. దాంతో గతంలో కన్నా ఈసారి జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో ఎక్కువ మంది ఈ ఎర్లీబర్డ్ కింద ఆస్తి పన్ను చెల్లించారు.

ఎర్లీబర్డ్‌లో వసూలైన పన్ను ఇలా.. (రూ.లలో)

మున్సిపాలిటీ	ఆస్తి పన్ను	వసూలు	శాతం
నల్లగొండ	52,78,98,000	6,66,66,000	12.62
మిర్యాలగూడ	23,66,02,000	2,51,87,000	10.64
దేవరకొండ	2,07,15,000	63,35,867	30.58
చండూరు	55,00,000	12,00,000	21.81
చిట్యాల	1,51,00,000	56,00,000	37.08
హాలియా	1,92,00,000	49,55,000	25.80
నకిరేకల్	5,00,00,000	2,66,00,000	53.02

నకిరేకల్ టాప్.. మిర్యాలగూడ లాస్ట్

రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఐదు శాతం రాయితీ అవకాశాన్ని నకిరేకల్ మున్సిపాలిటీ ప్రజలు అత్యధికంగా సద్వినియోగం చేసుకున్నారు. ఇక్కడ అత్యధికంగా 51 శాతం ఆస్తి పన్ను వసూలు అయింది. అదే విధంగా చండూరు మున్సిపాలిటీలో మాత్రం అతి తక్కువ మంది మాత్రమే ఆస్తి పన్ను చెల్లించారు. కాగా నల్లగొండ పట్టణంలో రూ.6,66,66,000 మిర్యాలగూడలో రూ.2,51,87,000, దేవరకొండలో రూ.63,35,867, చండూరులో రూ.12లక్షలు, చిట్యాలలో రూ.56లక్షలు, హాలియాలో రూ.49,55,000, నకిరేకల్‌లో రూ.2.66 కోట్ల ఆస్తి పన్ను వసూలు అయింది. ఎక్కువగా వాణిజ్య భవనాల వారు దీనిని సద్వినియోగం చేసుకుని ఐదు శాతం రాయితీ పొందినట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

పెరిగిన పన్ను వసూలు

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపు అంటే ఎక్కువ మంది ప్రజలు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో చెల్లించాలని భావిస్తుంటారు. ఇలా చెల్లించడం వల్ల ఆస్తి పన్నుపై అదనపు వడ్డీ పడుతుంది. కానీ, ఈ విషయం తెలియక చాలా మంది వడ్డీతో సహా చెల్లిస్తుంటారు. ప్రభుత్వం ఏప్రిల్ నెలలో చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ అవకాశం ఇవ్వడం కారణంగా అనేక మంది ప్రజలు ఆస్తి పన్ను చెల్లించడంతో మున్సిపాలిటీల ఖజానాలు గలగల అంటున్నాయి. ఐదు శాతం రాయితీ కారణంగా గతంలో కంటే ఈసారి కోట్ల రూపాయల పన్ను వసూలు కావడం విశేషం.

ప్రజల నుంచి స్పందన వచ్చింది

ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇవ్వడంతో ఆస్తి పన్ను చెల్లించేందుకు ప్రజల నుంచి స్పందన వచ్చింది. రాయితీకి సంబంధించి వివిధ రూపాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాం. ప్రజలంతా తమ ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి. మొదటి త్రైమాసికానికి సంబంధించి జూన్ నెలలోగా చెల్లించి వడ్డీ పడకుండా చూసుకోవాలి.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

కాంగ్రెస్ హయాంలో అరాచకాలు పెరిగాయి

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల కాలంలోనే రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయాయని ఓడిపోతామని తెలుసుకున్న కాంగ్రెస్ మంత్రులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం నల్లగొండలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటమి గ్రహించిన కాంగ్రెస్ నేతలు బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అడ్డగోలుగా కేసులు పెడుతున్నారని, కొందరు ఎస్‌ఐలు కాంగ్రెస్ కార్యకర్తల్లా పని చేస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం ఒక్క నోటీసు పంపితే సీఎం రేవంత్‌రెడ్డి వణికిపోతున్నాడని ఎద్దేవా చేశారు. కేసీఆర్ రోడ్ షోలకు లక్షలాది జనం వస్తుండడంతో బీఆర్‌ఎస్ 16 ఎంపీ సీట్లు గెలుస్తుందని తేలడంతో భయపడి ఈ డ్రామాలకు తెర తీశారన్నారు. జానారెడ్డి లాంటి పెద్ద మనిషి సూర్యాపేట, తుంగతుర్తిలో అభివృద్ధి జరగలేదని మాట్లాడటం సరికాదన్నారు. 17 సంవత్సరాలు మీరు మంత్రిగా చేశారని, తాను పదేళ్లు మంత్రిగా చేశానని ఉమ్మడి జిల్లాలో ఏ నియోజకవర్గంలో ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో బహిరంగంగా చర్చించేందుకు సిద్ధమా అని జానారెడ్డికి సవాల్ విసిరారు. తాను పార్టీలు చూడకుండా అభివృద్ధి చేశానని, జానారెడ్డి చలకుర్తిలో కూడా అభివృద్ధి చేయలేదన్నారు. రైతుబంధు రాలేదని స్వయంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పాడని, రైతుబంధు రాలేదన్న వారిని చెప్పుతో కొడుతానన్న మంత్రి కోమటిరెడ్డి ఇప్పుడు తుమ్మలను కొడతారా అని ప్రశ్నించారు. ఇద్దరు మంత్రులు డ్రామాలాడితే కొట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కటికం సత్తయ్యగౌడ్, పంకజ్ యాదవ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, జమాల్‌ఖాద్రి, నిరంజన్‌వలి, మెరుగు గోపినాథ్ పాల్గొన్నారు.

• కదంతొక్కిన కార్మికలోకం



మే డే సందర్భంగా బుధవారం మిర్యాలగూడ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు, ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు

యాదాద్రిలో నిత్యపూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం వంటి సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజలు చేపట్టారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు జరిపించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి శయనోత్సవం నిర్వహించి, ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న వర్షిత్‌రెడ్డి

మునుగోడు : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని పులిపలుపుల గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆ పార్టీ బూత్‌స్థాయి కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పదేళ్ల కాలంగా దేశంలో పేదరికం నిర్మూలనకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. భువనగిరి పార్లమెంట్ స్థానంలో బీజేపీ నుంచి బరిలో నిలిచిన బూర నర్సయ్యగౌడ్ గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణుకుమార్, బోడిగె అశోక్‌గౌడ్, పెంబళ్ల జానయ్య, ముంగి ధనంజయ్య, మధుమోహన్, బొడ్డు నాగరాజుగౌడ్, మాదగోని నరేందర్‌గౌడ్, కంభంపాటి నర్సింహ, బొల్గూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పులు కక్కుతున్న భానుడు

మునుగోడు మండలం గూడపూర్‌లో 46.6 డిగ్రీల ఉష్ణోగ్రత



నిడమనూరులో మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా ఉన్న రహదారి

- జిల్లా అంతటా 43 డిగ్రీలకుపైనే..
- ఎండ తీవ్రతకు అల్లాడుతున్న జనం

నల్లగొండ టౌన్ : నల్లగొండ జిల్లా నిప్పుల కుంపటిగా మారింది. భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. జిల్లాలోని చాలా మండలాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలోని 9 మండలాల్లో అత్యధికంగా 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మునుగోడు మండలం గూడపూర్‌లో అత్యధికంగా 46.6 డిగ్రీలు, చండూరు మండల కేంద్రంలో 46.5 డిగ్రీలు, దామరచర్ల మండలం తిమ్మాపూర్‌లో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా చింతపల్లి మండలం గొంకొండ్లలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైంది. ఎండ తీవ్రతతో ప్రజలు ఇంటి నుంచి బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. మరో మూడు నాలుగు రోజులు ఎండల తీవ్రత పెరగడంతో పాటుగా వడగాడ్పు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్న పరిస్థితి.

46 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు..

త్రిపురారం మండలం మాటూరు, నిడమనూరు. మిర్యాలగూడ మండలం తడకమళ్ల, చందంపేట మండలం తెల్దేవరపల్లి, దామరచర్ల, మాడుగులపల్లి.

45 డిగ్రీలకు పైగా..

నాంపల్లి, అనుముల మండలం ఇబ్రహీంపేట, కనగల్, నిడమనూరు మండలం రేగులగడ్డ, త్రిపురారం మండలం కామారెడ్డిగూడెం, చండూరు మండలం పుల్లెంల, నల్లగొండ ట్రాన్స్‌కో కార్యాలయం, కేతేపల్లి, నార్కట్‌పల్లి మండల కేంద్రం, చిట్యాల మండలం ఉరుమడ్ల, మిర్యాలగూడ మండలం టీక్యాతండా, అడవిదేవులపల్లి మండలం ముల్కచర్ల, అనుముల మండలం యాచారం.

44 డిగ్రీలకు పైగా..

గుర్రంపోడు మండలం జునూతుల, వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం, పెద్దవూర మండలం పులిచర్ల, నకిరేకల్, నల్లగొండ కలెక్టరేట్, కట్టంగూరు, పీఏపల్లి మండలం కోదండపురం, హాలియా, పెద్దవూర మండలం చలకుర్తి, తిప్పర్తి మండలం పజ్జూరు, నల్లగొండ మండలం వెలుగుపల్లి, తిరుమలగిరిసాగర్, శాలిగౌరారం, దేవరకొండ మండలం ముదిగొండ, గుర్రంపోడు, నేరెడుగొమ్ము, పీఏపల్లి మండలం ఘన్‌పూర్.

43 డిగ్రీలకుపైగా..

గుండ్లపల్లి మండలం డిండి, పీఏపల్లి మండలం అంగడిపేట, చందంపేట, గట్టుప్పల్ మండలం శివన్నగూడెం, కొండమల్లేపల్లి, గుండ్లపల్లి మండలం ఎర్రారం, శింగరాజ్‌పల్లి, చందంపేట మండలం పోలెపల్లి, మర్రిగూడ.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం : ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ చందనాదీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పు వల్ల ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. బయటకు వెళ్లి వచ్చిన తర్వాత నీరసంగా అనిపించడం, శరీరం వేడి కావడం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే చక్కెర, ఉప్పు ద్రావణాన్ని తాగాలని సూచించారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

బీజేపీ గెలుపు ఖాయం

కోదాడరూరల్: నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుపు ఖాయమని పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారీ, రాష్ట్ర నాయకుడు చాడ శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కోదాడ పట్టణంలోని పెరిక కల్యాణ మండపంలో తమిళనాడు రాష్ట్ర బీజేపీ జనరల్ సెక్రటరీ మురుగన్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుభాష్ చంద్రజీలతో నిర్వహించిన అసెంబ్లీ, మండల కోఆర్డినేటర్‌ల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి ఓటరుకు వివరించాలన్నారు. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి, రతన్‌చా, కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, నరేష్‌గౌడ్, నూనె సులోచన్, శ్రీలతరెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న చాడ శ్రీనివాసరెడ్డి

సూర్యాపేటలో పోలీస్ యాక్ట్ అమలు

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 30వ తేదీ వరకు నెల జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్–1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేనిదే ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేంలా, ప్రజాధనానికి నష్టం కల్గించేలా చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించాలని సూచించారు. అనుమతులు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

మేధావులు, విద్యావంతులు రాజకీయాలను మార్చాలి

- నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్



నేరేడుచర్లలో ఇంటింటి ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి చొల్లేటి ప్రభాకర్

నేరేడుచర్ల: డబ్బుతో ముడిపడిన ప్రస్తుత రాజకీయాలను మార్చేందుకు యువత, విద్యావంతులు, మేధావులు కృషి చేయాలని నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన నేరేడుచర్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ తనను ఎంపీగా గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కొంత మంది కుటుంబాల చేతిలో బందీఅయ్యిందని అన్నారు. ఓటర్లు డబ్బు, మద్యానికి అమ్ముడుపోకుండా ఎన్నికల్లో మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. మేధావులు, విద్యావంతులకు రాజకీయ పార్టీలు ఎన్నికల్లో టికెట్లు ఇవ్వడం లేదని, అందుకే నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

23మంది బైండోవర్

భువనగిరి క్రైం: యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర అన్నారు. భువనగిరి జిల్లా వ్యాప్తంగా బుధవారం 23 మందిని బైండోవర్ చేసినట్లు డీసీపీ తెలిపారు. అదేవిధంగా 89.07 లీటర్ల మద్యం, రూ.3,59,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎలక్షన్ కోడ్‌ను ఎవరు అతిక్రమించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్నికలపై నిఘా నేత్రం

- ప్రత్యేక బృందాలు ఏర్పాటు
- సభలు, సమావేశాలు, ప్రచారంపై నజర్
- 360 డిగ్రీల కెమెరాలతో పర్యవేక్షణ
- విస్తృతంగా తనిఖీలు
- నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీకి చెక్ పెట్టేలా ప్రణాళిక



సూర్యాపేట : లోక్‌సభ ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేసింది. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. నగదు, మద్యం ఇతర వస్తువుల పంపిణీకి అడ్డుకట్ట వేసేందుకు ఇప్పటికే ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ), స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ), వీడియో సర్వేలెన్స్ టీమ్ (వీఎస్‌టీ), వీడియో వ్యూయింగ్ టీమ్(వీవీటీ)లను నియమించింది. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గాల్లో ఈ నిఘా బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రవేశ పెట్టిన 360 డిగ్రీల కోణం కెమెరాల విధానాన్ని లోక్ సభ ఎన్నికల్లోనూ ఎఫ్ఎస్‌పీ వాహనాలకు వినియోగిస్తున్నారు. ఈ బృందాలు ఆయా పార్టీల సమావేశాలు, సభలు, అభ్యర్థుల ప్రచారంపై నిఘా పెట్టాయి.

బృందాలు ఇలా ఉన్నాయి.	
ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ :	12
స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్ :	12
వీడియో సర్వేలెన్స్ టీమ్ :	4
వీడియో వ్యూయింగ్ టీమ్ :	4

రాష్ట్ర, జిల్లా కార్యాలయాలకు అనుసంధానం

నిఘా బృందాల వాహనాలకు 360 డిగ్రీల కోణం కెమెరాలు అమర్చారు. సాంకేతిక పరిజ్ఞానంతో వీటిని రూపొందించారు. ప్రతి నియోజకవర్గంలో తనిఖీ బృందాలకు ఈ వాహనాలు ఏర్పాటు చేశారు. వీటికి జియోట్యాగింగ్ చేశారు. రాష్ట్ర, జిల్లా ఎన్నికల కార్యాలయాలకు అనుసంధానం చేశారు. ఆయా నియోజకవర్గంలో జరిగే ఘటనలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు వీక్షిస్తారు.

బృందాల ఏర్పాటు ఇలా..

జిల్లాలో నల్లగొండ లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని సూర్యాపేట, కోదాడ, హుజుర్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్లు, భువనగిరి లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని తుంగతుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ ఉన్నాయి. వీటి పరిధిలో ప్రత్యేక నిఘా బృందాలు పని చేస్తున్నాయి. పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖలను ఇందులో భాగస్వాములను చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో పోలీస్ అధికారి, ఒక వీడియోగ్రాఫర్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్‌లో డిప్యూటీ తహసీల్దార్, పోలీస్, ఆబ్కారీ, అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు. వీడియో సర్వేలెన్స్ బృందం ద్వారా వచ్చిన వీడియోలను వ్యూయింగ్ బృందం సభ్యులు నిశితంగా పరిశీలిస్తారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) బృందంలో గెజిటెడ్ అధికారితో పాటు పోలీస్, వీడియోగ్రాఫర్ ఉంటారు. నియమావళి, ఉల్లంఘన, అభ్యర్థుల ప్రచారం, ఖర్చులపై వీరు నిఘా పెడతారు.

బీజేపీ పాలనకు చరమగీతం పాడాలి

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న జానారెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న

వేములపల్లి: కేంద్రంలో బీజేపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి వేములపల్లి మండల కేంద్రంలో ఆయన ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం, కులం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ లోక్ సభ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కుట్రలు చేస్తోందన్నారు. 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 30లక్షల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ పెంచిన ఘనత కాంగ్రెస్‌దేనని, కానీ బీజేపీ ప్రభుత్వం ముస్లింల రిజర్వేషన్లను మొత్తంగా తొలగించేందుకు కుట్రలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయంగా నడిచిందన్నారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టి దాన్ని అధోగతిపాలు చేసిందన్నారు. కాంగ్రెస్ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, టీపీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, ఎంపీపీ పుట్టల సునీత, మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, నాయకులు పుట్టల శ్రీను, రేగట్టె రవీందర్ రెడ్డి, కందిమళ్ల లక్ష్మారెడ్డి, పిల్లల సందీప్, బీరవెల్లి సతీష్‌రెడ్డి, పుట్టల కృపయ్య, బొంగర్ల వినోద్, ఋసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పేరెల్లి నగేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

రాజాపేట: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మునుగోడు ఎమ్మెల్యే, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తరఫున రాజాపేట మండల కేంద్రంలోని రోడ్ షో, భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రశ్నించే గొంతుకను అణిచివేశారన్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, జిల్లా నాయకులు జనగాం ఉపేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి పోటీచేసేందుకు నాయకుడే ఉండడు

మునుగోడు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీచేసేందుకు ఒక్క నాయకుడు కూడా ఉండడని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మునుగోడు, సింగారం గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మునుగోడులోని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.



రాజాపేట: మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి, పక్కన చామల, ఎమ్మెల్యే ఐలయ్య

కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నారబోయిన రవిముదిరాజ్, ఎంపీపీ కర్నాటి స్వామి, మాజీ ఎంపీపీ పోలగొని సత్యం, మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి అధికారంలోకి రావడం ఖాయం

- భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

కట్టంగూర్: కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావటం ఖాయమని భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బుధవారం కట్టంగూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు లోక్ సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. దేశాభివృద్ధి బీజేపీతో సాధ్యమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి దేశ వ్యాప్తంగా 400 సీట్లు రావటం ఖాయమన్నారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేసిన బీజేపీని మరోసారి కేంద్రంలో అధికారంలోకి తీసుకురావాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీ మళ్లీ ప్రజలను మభ్య పెట్టేందుకు వస్తుందని, వారి మాటలు నమ్మొద్దన్నారు. గ్రామాల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని తెలిపారు. తనను ఎంపీగా గెలిపిస్తే కట్టంగూర్ మండల కేంద్రంలో అదనపు అండర్ పాస్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాబిన్ దేవయ్య, రవినాయక్, మొగులయ్య, నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మైల నర్సింహ, మండల అధ్యక్షుడు పబ్బు వెంకన్న, మండల వెంకన్న, గోలి ప్రభాకర్, కోమటి భాస్కర్, పులకరం శంకర్, గున్నాల నాగరాజు, కారంపూడి సాయికుమార్, పాదూరి వెంకట్‌రెడ్డి, ఒరుగంటి హరిబాబు, సిద్ధగోని మల్లికార్జున్ ఉన్నారు.



కట్టంగూర్ రోడ్ షోలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం శివారులో హైదరాబాద్–విజయవాడ హైవేపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం పోచారం గ్రామానికి చెందిన నల్లబెల్లి చందన్‌కుమార్(24), హుజూర్‌నగర్‌కు చెందిన రాజేష్(28) పోచారం సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఇద్దరు కలిసి బుధవారం ఉదయం విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం దండుమల్కాపురం గ్రామ శివారులోకి రాగానే రోడ్డు వెంట ఉన్న చెట్టును ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న చందన్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. రాజేష్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మఠంపల్లి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందపురానికి చెందిన కంకణాల రాము సుతారి పని చేస్తుంటాడు. ఆదివారం అదే కాలనీకి చెందిన వెంటనర్సుతో కలిసి మఠంపల్లిలోని ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా మండలంలోని ఎర్రగట్టు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో వెంకటనర్సు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రాము హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

ప్రమాదవశాత్తు మిర్చిపంట దగ్ధం

గుర్రంపోడు: మండలంలోని జూనూతుల గ్రామంలో బుధవారం కుంభం మోహన్ అనే రైతు సాగుచేసిన మిర్చి పంటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. కాల్వ పక్కనే గల జమ్మికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మిర్చిపంటకు మంటలు అంటుకున్నాయి. ఎకరం మిర్చి పంట, కరెంట్ మోటారు స్టార్టర్, డ్రిప్ పైపులు కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు.



కాలిన మిర్చి పంట, డ్రిప్ పైపులు చూపుతున్న రైతు

గడ్డివాములు, వ్యవసాయ పైప్‌లైన్లు..

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట): మండల పరిధిలోని గట్టికల్ గ్రామంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గ్రామ శివారులోని గుండువారి బావి వద్ద సుమారు 20 ఎకరాల మేర వరి కొయ్యలకు మంటలు అంటుకున్నాయి. దీంతో సమీపంలో ఉన్న తాటి చెట్లు, గడ్డివాములు, వ్యవసాయ పైపులైన్లు దగ్ధమయ్యాయి. గమనించిన రైతులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని మంటలు ఆర్పివేశారు.

వరి కొయ్యలకు నిప్పంటించడంతో..

చండూరు: మండల పరిధిలోని గుండ్రపల్లి గ్రామంలో ఓ రైతు వరి పైరు కోసిన పొలానికి బుధవారం నిప్పంటించగా.. పక్కనే ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ధాన్యం రాశులకు మంటలు వ్యాపించాయి. గమనించిన సమీప రైతులు అప్రమత్తమై ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి రైతుల సాయంతో మంటలు ఆర్పారు. ధాన్యానికి ఎలాంటి నష్టం కలగపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీసీఓ కిరణ్‌కుమార్, డీఎం నాగేశ్వర్‌రావు, కేంద్రం మానిటరింగ్ అధికారి మురళి కేంద్రాన్ని పరిశీలించారు.



చండూరు: గుండ్రపల్లిలో ధాన్యం కేంద్రం పరిశీలిస్తున్న అధికారులు

యాదాద్రీశుడి దర్శనం పూర్వజన్మ సుకృతం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకోవడం తమ పూర్వ జన్మ సుకృతమని ఏవీఎస్ఎం, వీఎస్ఎం, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండర్ రాజేష్ పెండర్కర్, రేర్ అడ్మిరల్, స్టేషన్ కమాండర్ రవ్‌నిష్ సేథ్ అన్నారు. బుధవారం యాదాద్రీశుడిని వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వాగతం పలకగా.. అర్చకులు సంప్రదాయంగా ఆహ్వానించారు. అనంతరం రాజేష్ పెండర్కర్, రవ్‌నిష్ సేథ్‌లు గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ లడ్డూ ప్రసాదం, శ్రీస్వామి వారి చిత్రపటాలు అందజేశారు. అనంతరం ప్రధానాలయాన్ని పరిశీలించారు.



రాజేష్ పెండర్కర్, రవినిష్ సేథ్‌లకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

మరో 5 శాఖలకు అనుమతులు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో ఐదు శాఖల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిందని బ్యాంకు చైర్మన్ కర్నాటి వెంకటబాలసుబ్రహ్మణ్యం, సీఈఓ సీత శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలో వారు మాట్లాడారు. కొండమల్లేపల్లి, ఇబ్రహీంపట్నం, తుర్కయంజాల్, ఆమన్‌గల్, కల్వకుర్తిలో నూతన బ్రాంచ్‌లకు అనుమతులు వచ్చాయని, త్వరలో బ్యాంకు సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. నూతనంగా మంజూరైన 5 బ్రాంచ్‌లతో కలుపుకొని మొత్తం 14 బ్రాంచుల ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తున్నామని చెప్పారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంకు రూ.325 కోట్ల వ్యాపారం చేసి, రూ.2.57 కోట్ల నికర లాభాన్ని అర్జించిందని తెలిపారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ సూరెపల్లి రమేష్, డైరెక్టర్లు సీత దామోదర్, బోగ విజయ్‌కుమార్, చిక్క కృష్ణ, పున్న లక్ష్మీనారాయణ, కొండమడుగు ఎల్లస్వామి, కడవేరు కవిత, అర్చన, రాపోలు వేణు, బిట్టు భాస్కర్, మేనేజర్లు, సిబ్బంది ఉన్నారు.

జూదరుల అరెస్ట్

త్రిపురారం: మండల కేంద్రంలోని వల్లూరి సుబ్బారావు ఇంటి ఆవరణలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతుండగా బుధవారం త్రిపురారం పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుల సమాచారం మేరకు పేకాట ఆడుతున్న వల్లూరి సుబ్బారావు, అప్పల సుదర్శన్, ఈట నాగరాజు, ఉప్పు రాజేష్, బైరం దశరథలను అరెస్ట్ చేశామన్నారు. వీరి నుంచి రూ. 7,600 నగదు, 4 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

త్రిపురారం: ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే ప్రతి ఓటరు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సుమాలిని, డాక్టర్ మీనా అన్నారు. బుధవారం త్రిపురారం మండలం సత్యనారాయణపురంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వ్యవసాయంలో జీవ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. జీవ ఎరువులు వినియోగించడం వల్ల పంటల దిగుబడులు పెరుగుతాయని, నేల ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా రైతులకు ఉచితంగా జీవ ఎరువులు పంపిణీ చేశారు.



రైతులకు జీవ ఎరువులు పంపిణీ చేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలతో మోసం చేశాడు

- బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

సూర్యాపేట: రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశాడని బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమని, దేశంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. పేదల కోసం బీజేపీ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. వందల ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను ప్రధాని నరేంద్ర మోదీ పరిష్కరించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమస్యలను సృష్టించి వాటిపై ఓట్ల రాజకీయాలు చేస్తోందన్నారు. ఐదేళ్ల నల్లగొండ ఎంపీగా పనిచేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. రాహుల్ గాంధీ ప్రధానిగా పనికిరాడని ప్రజలు తిరస్కరిస్తున్నారని, ఉమ్మడి నల్లగొండ జిల్లా నాశనం కావడానికి కాంగ్రెస్ నాయకులే కారణమని మండిపడ్డారు. బిఆర్ఎస్‌కు ఓటేస్తే ఏమీ ఒరగదని, ఆ పార్టీకి ఓటేస్తే నోటాకు వేసినట్లే అని చెప్పారు. స్థానిక యువతకు మూడేళ్లలో 50వేల ఉద్యోగాలు, కూలీ చేసుకునే మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. అనంతరం ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ కోఆర్డినేటర్ సురేంద్ర రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి, రాష్ట్ర నాయకులు తుక్కని మన్మథరెడ్డి, బూరా మల్సూర్‌గౌడ్, పందురంగాచారి, బొల్లా కరుణాకర్, తస్నీరు వాసు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం ప్రారంభిస్తున్న ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

రైస్ మిల్లుల్లో 'ఎన్‌ఫోర్స్‌మెంట్' తనిఖీలు

సాక్షి, యాదాద్రి: భువనగిరిలోని ఓ రైస్ మిల్లులో బుధవారం సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సీఎంఆర్ ధాన్యం నిల్వలపై ఈ తనిఖీలు జరిగాయి. కాగా మార్చి నెల 23న ఇదే మిల్లులో తనిఖీలు చేసిన అధికారులు మరోసారి తనిఖీలు చేయడం మిల్లుల యాజమాన్యాల విభేదాల వల్లేనని తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల జిల్లాలో అధికారులు మిల్లులపై వరుస తనిఖీలు నిర్వహిస్తున్నారు. సుమారు 20 మిల్లుల్లో సీఎంఆర్ ధాన్యం నిల్వల లెక్కల్లో తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాగా మూడు రోజుల క్రితం భువనగిరిలోని ఓ మిల్లులో అధికారులు తనిఖీలు చేపట్టారు. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో అంతా సవ్యంగానే ఉన్నట్లు లెక్క తేలిందని సివిల్ సప్లయ్ డీఎం గోపికృష్ణ తెలిపారు. ఈ తనిఖీల్లో డైరెక్టర్ ఆఫ్ సివిల్ సప్లయ్ వీఎస్ఎన్ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ పద్మజా, డీసీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు వీఎస్ఎన్.ప్రసాద్, పద్మజా, శ్రీనివాస్‌రెడ్డి, డీఎం గోపికృష్ణ

చిత్రకళా గురువు దాసి సుదర్శన్

నాగార్జునసాగర్: బహుముఖ ప్రజ్ఞాశాలి దాసి సుదర్శన్ చిత్రకళా గురువుగా సాగర్ ప్రజలకు ఎనలేని సేవలందించారని వక్తలు కొనియాడారు. స్థానిక గ్రంథాలయంలో బంధువులు, మిత్రులు బుధవారం ఏర్పాటు చేసిన దాసి సుదర్శన్ సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సెక్యులర్ రైట్స్ ఫోరం జిల్లా కన్వీనర్ ప్రభాకర్ అధ్యక్షత నిర్వహించిన ఈ సభలో తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ మాజీ చైర్మన్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ.. నాగార్జునసాగర్‌తో దాసి సుదర్శన్‌కు ఎంతో అనుబంధముందని అన్నారు. మట్టి మనిషి పాండురంగారావు మాట్లాడుతూ.. దాసి సుదర్శన్ రచయితగానే కాకుండా ఎంతోమంది రచయితలు రాసిన పుస్తకాలకు ముఖచిత్రాన్ని వేసిన ఘనత వారికే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మట్టిమనిషి పాండురంగారావు, రాములు, సంజీవయ్య, కవి రాజు, రామ్మోహన్ పాల్గొన్నారు.



దాసి సుదర్శన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బంధువులు, మిత్రులు